

# కథా కౌముది

## ఆడబ్రతుకే మధురం అనువాదం – శారద

And Women Must Weep (For men must work) హెన్రీ హేండెల్ రిచర్డ్‌సన్

ఆఖరికి ఆమె ముస్తాబు ముగిసి లేచింది. అందమైన రిబ్బన్లు ముడులు వేయబడ్డాయి. పిన్నీసులు గుత్తంగా గుచ్చబడి దుస్తులు పొందికగా అమరాయి. మేనత్తా, పనమ్మాయి బిడన్స్ ,ఇద్దరూ ఆమెని కొంచెంసేపు గదిలోకి పోయి కూర్చొని విశ్రాంతి తీసుకొమ్మని బలవంత పెట్టారు. ఇంత ముస్తాబయ్యీ, సరిగ్గా పార్టీ సమయానికి అలసిపోతే ఏం లాభం? అందుకన్నమాట.

ఆమె గదిలోకైతే వెళ్ళింది కానీ, కుర్చీలో స్థిమితంగా కూర్చోలేకపోయింది. కూర్చుంటే తను వేసుకున్న గౌను నలిగిపోతుందేమోనన్న భయం ఆమెని కూర్చోనివ్వలేదు. ఆ గౌనుకని వాడిన బట్ట కొంచెం నాజూగ్గానే వుంది మరి. ఇంకా నయం, అత్త చెప్పినట్టు పట్టు గౌను ధరించింది కాదు తాను, అనుకుందామె. పట్టు వొద్దని నాజూకైన మస్లిన్‌తో కుట్టించుకుందీ గౌను. లేత నీలం రంగు గౌనంతా ఆమె చుట్టూ పల్చటి మేఘంలా అలుముకుంది. గౌను కత్తిరింపు వల్ల ఆమె వున్నదానికంటే పొడవుగా కనపడుతూంది. తనని తను అద్దంలో చూసుకుందామె. ఒక్క క్షణం అద్దంలో వున్న పొడుగాటి యువతిని గుర్తు పట్టలేకపోయింది.

పొడవుగా, తెల్లగా, పలచగా, నీలి మేఘంలాటి గౌనులో, జుట్టులో ముడిచిన పూలతో,అందంగా, తానేనా, అనుకుందామె ఆశ్చర్యంగా. తాను ఇంత అందంగా వున్నాట్టు ఆమెకి తెలియనే లేదు. ఎప్పుడూ మేనత్త గానీ, పనమ్మాయి కాని చెప్పలేదు కూడా. ఎప్పుడో ఒకసారి, "ఫర్వాలేదు, నువ్వు కూడా బానే వుంటావు డాలీ" అనే వారు, అంతే!

తన సున్నితమైన గులాబీ రంగు చర్మానికీ, పెద్ద పెద్ద నీలి రంగు కళ్ళకీ, ఉంగరాల జుట్టుకీ, అన్నిటికీ కలిపి ఆమె భగవంతుడికి మౌనంగా కృతజ్ఞతలు చెప్పుకుంది. అవేవీ లేని మిగతా తన ఈడు ఆడపిల్లలని తలచుకొని జాలి పడింది కూడా.

తన ముస్తాబూ, దుస్తులకీ తగిన విధంగా ఆమె పొడవుగా, గంభీరంగా కిటికీ దగ్గర నిలబడి బయటికి చూసింది. తనని విందుకి తీసికెళ్ళడానికి వచ్చే టాక్సీ కోసం చూస్తూందామె కిటికీలోంచి. ఇంకా చేతులకి తొడుక్కోని తెల్లటి గ్లోవ్స్ కిటికీని పట్టుకున్న ఆమె చేతుల మీద వేళ్ళాడుతున్నాయి.

అలంకరణా, బట్టలూ పెద్ద పిల్లలా అనిపిస్తూన్నా, నిజానికి ఇది మొదటిసారి ఆమె ఇలాటి విందుకి వెళ్ళడం. ఇప్పుడు తను అమ్మ చేయి పట్టుకుని నడిచే చిన్న పిల్ల కాదు. తలెత్తుకుని గంభీరంగా నడిచే యువతి. ఆ విషయం తలచుకుంటే చాలు ఆమె గుండెలు దడ దడా కొట్టుకుంటున్నాయి.

ఇలాటి విందుల్లోనే ఆడపిల్లలకి పెళ్ళి సంబంధాలు కుదిరేవి. అందుకే మేనత్త ఈ విందుకని తామిద్దరికీ రెండు టికెట్లు తీసింది. తననీ ఎవరైనా ఇష్ట పడితే బాగుండు. ముస్తాబంతా ముగిసింతరవాత పనమ్మాయి చిరాకు తెప్పించింది.

"అన్నట్టు డాలీ, డాన్సు చేసేటప్పుడు అడుగులు జాగ్రత్తగా వేయి," అంట! ఏం చాదస్తం!

మేనత్త కూడా అంతే. గుర్రబ్బగీ ఎక్కిన తరవాత "డాలీ, ముఖం మరీ అంత గంభీరంగా పెడితే అబ్బాయిలంతా భయపడి దూరంగా జరిగిపోతారు. కొంచెం నవ్వు ముఖం పెట్టు." ఆ మాటతో ఆమె మొహం ఇంకా బిగుసుకుపోయింది.

బగ్గీ విందు జరిగే టౌనుహాలు చేరుకుంది. ఎంత జాగ్రత్తగా గౌనంతా ఒద్దికగా చేత్తో పట్టుకుని దిగుతున్నా, అనుకున్నంతా అయింది. గౌనుకున్న ఆఖరి కుచ్చు బగ్గీ చివరి మెట్టుకున్న మేకుకి గుచ్చుకొని కొంచెం చిరిగిపోయింది. మేనత్త, "కాస్త చూసుకుని దిగలేవూ? ఏం పిల్లవే!" అంది చిరాగ్గా. డాలీ కళ్ళు నీటితో నిండిపోయాయి.

హాల్లో కోట్లు తీసుకుంటున్న పనమ్మాయి చిన్న సూది దారం కోసం అంతటా వెతికింది. ఎక్కడా దొరకలేదు. ఇక ఆ ఆఖరి కుచ్చంతా కత్తిరించేయక తప్పలేదు. అందమైన నీలం రంగు గౌను. ఆమె మనసు ఉసూరుమంది.

ఆఖరి కుచ్చు తీసేసి వేళ్ళాడుతున్న కుట్లతో వున్న గౌనుతో విందు హాల్లోంచి నడుస్తూ చచ్చేంత సిగ్గుపడిందామె. అందరూ తన గౌను అంచులవైపే చుస్తున్నట్టనిపించింది. అప్పటికే చాలా మంది అతిథులు వచ్చి అక్కడక్కడా వున్న కుర్చీల్లో కూర్చొని వున్నారు. మేనత్త అప్పటికే వొచ్చి కూర్చున్న తన స్నేహితురాలి పక్కన ముందు వరసలో కూర్చుంది. డాలీ సిగ్గూ మొహమాటం, భయమూ ముప్పిరిగొనడంతో వెనక ఇంకొక కుర్చీలో వెళ్ళి కూర్చుంది.

తన గౌను అంచులు కనబడకుండా సర్దుకుని కూర్చుంది. అప్పటికే మొదటి రౌండు డాన్సు అయిపోయినట్టుంది. అమ్మాయిలూ అబ్బాయిలూ కుర్చీల్లో కూర్చుని అలసట తీర్చుకుంటున్నారు.

మళ్ళీ రెండో రౌండు డాన్సు మొదలవుతుందని తెలిసి అబ్బాయిలు అమ్మాయిలని నాట్యం కోసం అడగడం మొదలైంది. తనని కూడా ఎవరైనా అడుగుతారేమో! డాలీ మనసంతా ఉద్వేగమూ, సిగ్గూ నిండి పోయాయి. ఒక్కసారి చుట్టంతా కలయచూసింది.

అసలు విందుకొచ్చి పది నిమిషాలు కావొస్తున్నా ఎవరూ తన ముస్తాబునీ, బట్టలనీ మెచ్చుకోలేదు. కనీసం బయట కోట్లు తీసుకుంటున్న పనమ్మాయైనా, "అబ్బా! ఎవరీ అందగత్తె? ఇంత అందమైన గౌను ఎక్కడ కుట్టించావు?" అని అడగనైనా అడగలేదు. పైగా, "ఇంత పల్చటి బట్ట చిరక్కేం చేస్తుంది," అంది చిరాగ్గా. డాలీ మనసు కొంచెం చిన్నబుచ్చుకుంది.

ఒకసారి హాలంతా కలయచూసింది డాలీ. అందరి బట్టలూ, ముస్తాబూ చాలా అందంగా అనిపించాయామెకి. తనే ఈ పల్చటి గౌనుతో మధ్యతరగతి అమ్మాయిలా సామాన్యంగా వుంది. పట్టుబట్టతో గౌను కుట్టించుకోవాల్సిందేమో!

బహుశా మేనత్తకి కూడా అలాగే అనిపించిందేమో! డాలీ వంక కాసేపు కళ్ళార్పకుండా చూసింది. ఆ తరవాత కొంచెం విసుగు నిండిన గొంతుతో, "అలా ఒక మూల ఒదిగి కూర్చుంటే నిన్నెవరు చూస్తారు? ఇలా నా పక్కకి, ముందు వరసలోకొచ్చి కూర్చో. అప్పుడు ఎవరైనా నిన్ను చూసి డాన్సుకి రమ్మనే అవకాశం వుంటుంది," అంది.

డాలీ మౌనంగా ముందుకొచ్చి అత్త పక్కన కూర్చుంది. అందరి వంకా కొంచెం తలెత్తి చూసింది, డాన్సుకి రమ్మని పిలిస్తే తను సిద్ధంగానే వున్నానన్నట్టు.

రెండో విడత ముగిసింది, మూడో డాన్సు మొదలైంది కూడా. కానీ, డాలీ వంక ఎవరూ కన్నెత్తి చూడడం లేదు.

డాలీకి చచ్చేంత సిగ్గుగా, అవమానంగా వుంది. మేనత్త లేచి ఆ విందు నిర్వాహకుడిని దగ్గరకు రమ్మని సైగ చేసింది. ఆ సాయంత్రానికి కావాల్సిన సంగీతం వగైరా ఏర్పాట్లు చూస్తున్న నిర్వాహకుడు మెల్లిగా హాలంతా దాటి మేనత్త దగ్గరికొచ్చాడు. ఇద్దరూ గుసగుసలుగా మాట్లాడుకున్నారు. ఆతని గొంతు మాత్రం డాలీకి శుభ్రంగా వినపడింది.

"ఏమిటీ? ఎవరూ డాన్సుకి రమ్మని ఆహ్వానించలేదా? అయ్యో పాపం! సరే, నేను ఎవరినైనా అడిగి చూస్తాను. మీరు అమ్మాయి దగ్గరే కూర్చొండి." అతను మళ్ళీ పడుతూ లేస్తూ అటువైపుకెళ్ళాడు.

అతను దూరంగా ఇద్దరు ముగ్గురు అబ్బయిలతో, తన వంక చేయి చూపిస్తూ మాట్లాడుతూండడం చూసింది డాలీ. కానీ వాళ్ళెవరూ ఆమెతో డాన్సు చేయడానికి ఎటువంటి ఉత్సాహమూ చూపించలేదు. నిర్వాహకుడు మళ్ళీ వాళ్ళ దగ్గరికొచ్చాడు.

"వాళ్ళే వొస్తారలెండి. అంతవరకూ నాతో అమ్మాయిగారు ఒక్క డాన్సు చేస్తే, నా కంటే అదృష్టవంతుడుండడు, " మర్యాదగా అడిగాడు. డాలీకి వొళ్ళు మండిపోయింది కానీ, విధిలేక చాలా ఆనందిస్తున్నట్టు మొహం పెట్టి అతని చేయందుకొని లేచింది. ఇద్దరూ డాన్స్ ఫ్లోర్ వైపు నడిచారు.

అతనితో డాన్సు చేస్తున్నంతసేపూ ఆమెకి ఫ్లోర్ మీద తను చచ్చిపోతున్నట్టనిపించింది. తనకి అతనితో కలిసి నాట్యం చేయాల్సిన గతి ఎందుకు పట్టిందో అందరికీ అర్థమైపోతుంది. బహుశా అమ్మాయిలూ, అబ్బాయిలూ తనని చూసి నవ్వుకుంటున్నారేమో! నాట్యంలో భాగంగా అతను ఆమెని నడుం పట్టుకొని పైకెత్తి దింపినప్పుడూ, ఆమె నడుం చుట్టూ చేయి వేసినప్పుడూ అందరూ తమని చూసి నవ్వినట్టనిపించింది ఆమెకి. ఎట్టకేలకు ఆ డాన్సు ముగిసి ఆమె ప్రాణం కుదుటపడింది.

మేనత్త స్నేహితురాలికి ఒక కొడుకున్నట్టున్నాడు. మేనత్త ఆమెని బ్రతిమిలాడింది. ఆ స్నేహితురాలు సరేనని తల వూపి తన కొడుకు దగ్గరికి నడిచింది. మెల్లిగా కొడుకుతో ఏదో చెప్పింది. అతను విసుగ్గా డాలీ వైపు తల తిప్పి చూసాడు. అతను ఈ డాన్సుకి తన కాబోయే భార్యను తీసుకొచ్చాడు. ఆమె వుండగా ఇంకో అమ్మాయితో డాన్సు చేయడం మీద అతనికేమాత్రం ఆసక్తి లేదు. అయినా తల్లి మాట తీసేయలేక, పక్కనున్న అమ్మాయితో ఏదో సర్ది చెప్పి లేచి డాలీ దగ్గరికొచ్చాడు.

తన అయిష్టతని దాచుకోవడానికే మాత్రం ప్రయత్నించలేదతను. కనీసం నవ్వు మొహం పెట్టలేదు. డాలీ దగ్గరకొచ్చి నిలబడి రమ్మన్నట్టు చేయందించాడంతే! డాలీ మాత్రం నవ్వు మొహం పెట్టి అతని చేయందుకొని నడవాల్సొచ్చింది. ఆమెకి తన మీద తనకే అసహ్యం ముంచుకొచ్చింది.

ఆమెకి ఆ నాట్యం కూడా ఏ మాత్రం రుచించలేదు. వీలైతే అక్కణ్ణించి మాయమై పోవాలనిపించింది. కానీ ఏదో ఆశక్తత ఆమెని నివారించింది. పైగా, నాట్యం చేస్తూన్నంత సేపూ అతను తన కాబోయే భార్య వైపే చూస్తూ ఆమెకి సైగలు చేస్తూనే వున్నాడు. ఆ డాన్సు ముగించి డాలీని తన కుర్చీ దగ్గరకు తెచ్చి వదిలేసాడతను. మళ్ళీ అతని తల్లి అతన్ని ఇంకొక్కసారి డాన్సు చేయమని అడిగినట్టుంది, అతను విసుగ్గా మొహం పెట్టి, ఇప్పుడే వొస్తానన్నట్టు చేయి ఊపి దూరంగా వెళ్ళి పోయాడు.

అందరికీ దూరంగా ఊరికే చూస్తూ నిలబడ్డ ఒక మధ్య వయస్కుని దగ్గరకెళ్ళి, డాలీ వైపు చూపించి ఏదో చెప్పాడు. అతను తనకి నాట్యం మీద ఆసక్తి లేదన్నట్టు తల అడ్డంగా వూపాడు. ఎంతో బ్రతిమాలించుకోని ఆ మధ్య వయస్కుడు డాలీ దగ్గరకొచ్చి నాట్యానికి రమ్మని ఆహ్వానించాడు. చామన చాయలో, సన్నగా, పొడవుగా అతనే మాత్రం ఆకర్షణీయంగా లేడు. పైగా ఎంతో దురుసుగా, "ముందే చెప్తున్నా, నాకు నాట్యం అసలే మాత్రం రాదు," అన్నాడు.

ఐనా ఆమె అతని చేయందుకొని పైకి లేచింది. విధి లేక అతనితొ డాన్స్ ఫ్లోర్ మీదికి నడిచింది. అతను నాట్యం చేస్తూన్నంత సేపూ ఆమె కాళ్ళు తొక్కాడు, గౌను తొక్కాడు. ఇక ఆమె వుండబట్టలేక మధ్యలోనే , "నేను ఈ డాన్సు

చేయలేనండీ, నేను వెళ్ళి కూర్చుంటాను," అంది. అతను ఇంకా మొరటుగా, "హమ్మయ్య!" అన్నాడు. ఆమె మొహం చిన్నబుచ్చుకోని తన స్థానం లోకి వొచ్చి కూర్చుంది.

ఆ తరవాత సాయంత్రమంతా డాలీ అలా కుర్చీలో కూర్చొనే గడిపేసింది. ఆమెని ఎవరూ డాన్సు చేయమని అడగలేదు. ఆమెకి ఎందుకో అది ఆ మధ్యవయస్కుడి పనే అనిపించింది. అతనే వెళ్ళి అందరితో తనకి డాన్సు రాదని అందరికీ చెప్తున్నాడేమో, అందుకే ఎవరూ తనని అడగడం లేదు, అనుకుంది ఉక్రోషంగా.

కొన్నిసార్లు కొందరు అబ్బాయిలని చూసి ఆశపడింది లేత మనసు. ఒకరిద్దరు అబ్బాయిలు తనవంకే నవ్వుతూ రావడం చూసి తనకోసమే వొస్తున్నారనుకొని తనూ నవ్వు మొహంతో తల పైకెత్తింది. కానీ వాళ్ళు దగ్గరికొచ్చి తల తిప్పుకొని వెళ్ళిపోయారు. మరీ ఒక అందగాడు చాలా దగ్గరికొచ్చిన తరవాత గానీ తెలియలేదు, అతను తన వెనక వున్న అమ్మాయికోసం వస్తున్నాడని. ఆమెకి ఏడుపొచ్చింది.

ఆ తరవాత ఆమెకి ఆ సాయంత్రం నరకంలో వున్నట్టు గడిచింది. అన్నిటికంటే ముఖ్యంగా, ఆమెకి ఎటు చూడాలో అర్థం కాలేదు. నాట్యం చేస్తున్న జంటల వంక చూస్తే, తాను వాళ్ళని చూసి ఈర్ష్య పడుతున్నాననుకోవచ్చు. కుర్చీల్లో కుర్చుని వున్న అబ్బాయిల వంక చూస్తే, ఆహ్వానిస్తున్నాననుకుంటారేమో! ఎంత సేపని నేల వంక చూస్తూ గడపడం?

మేనత్త కూడా ఇక చేతులెత్తేసింది. "నువ్వు అలా ఏడుపు మొహంతో కూర్చుంటే ఏ అబ్బాయికి మాత్రం నువ్వు నచ్చుతావు? అంతా ఖర్మ," అని మొహం ముడుచుకుంది.

డాలీకి ఆ సాయంత్రమంతా మొహం మీద చిరునవ్వు అతికించుకోని అందరివంకా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా చూస్తూ గడపడం దుర్భరమనిపించింది. అందులోనూ ఎవరూ ఆమె వంక చిరునవ్వుతో చూసిన వారే లేరు. తనలా ఒంటరిగా కూర్చున్న అమ్మాయిలెవరూ కనిపించలేదు ఆమెకి.

మగవాళ్ళెంత అదృష్టవంతులు! వాళ్ళు హాలంతా దర్పంగా తమకి నచ్చిన అమ్మాయికోసం వెతుక్కోగలరు. మనం చేయగలిగేదల్లా, మనం వాళ్ళకి నచ్చితే బాగుండు అని ప్రార్థిస్తూ కూర్చోవడమే. మగవాళ్ళెంత దుర్మార్గులు. తమకి నచ్చని ఆడదానివంక కన్నెత్తైనా చూడరు. మగ్వాళ్ళంటే నాకసహ్యం, అనుకుందామె విరక్తిగా. భోజనాలకి ముందుగా ఆఖరి డాన్సు మొదలైంది. ఆడ వాళ్ళు ముందుకొచ్చి మగవాళ్ళని డాన్సుకి ఆహ్వానించడం ఈ ఆఖరి డాన్సు ప్రత్యేకత.

"డాలీ, ఈ అవకాశం వొదలకు. డాన్సు ఫ్లోర్ మీదికెళ్ళి నీకు నచ్చిన వారిని పిలువు," మేనత్త అంది ప్రోత్సాహంగా.

"చచ్చినా నేను ఏ మగవాణ్ణీ పిలవను," తెగించిన మొండితనంతో కఠినంగా అంది డాలీ.

అసలు ఈ యవ్వనమూ ఈ గోలా లేకుండా ఒక్క పట్టున ముసలి వాళ్ళమై పోతే యే గొడవా వుండదు. మేనత్తది తెల్లబడిన జుట్టు, ఎప్పుడూ వొదులుగా వుండే నల్ల గౌను తొడుక్కుని వుంటుంది. ఆమెని ఎవరూ డాన్సుకి

పిలిచినా పిలవకపోయినా ఎవరూ పట్టించుకోరు. తనూ అలా తెల్లబడిన జుట్టుతో నల్ల బట్టలు కట్టుంకుంటే ఎంత బాగుండేది.

మౌనంగా అందరితోపాటూ భోజనానికి లేచింది డాలీ. మేనత్త స్నేహితురాలితోపాటు కూర్చున్నారు వాళ్ళు. ఆవిడతో ఆవిడ కొడుకూ, అతని కాబోయే భార్యా కూర్చున్నారు. డాలీకి ముద్ద మింగుడు పడలేదు. మెత్తటి సాండ్‌విచ్‌లూ, కేకులూ అన్నీ గొంతుకడ్డం పడి కిందకి దిగకుండా మొరాయించాయి.

బహుశా ఆ అబ్బాయి తన ప్రవర్తనకి పశ్చాత్తాప పడ్డట్టున్నాడు. మరి లేదా, మళ్ళీ వాళ్ళమ్మ ప్రోద్భలమో కానీ, భోజనాల తరవాత మళ్ళీ డాన్సు మొదలైనప్పుడు, ఆమెని డాన్సుకి రమ్మని ఆహ్వానించాడు. డాలీ అతనితో కలిసి డాన్సు ఫ్లోర్ మీదికెళ్ళింది కానీ, ఆమె కాళ్ళు నాట్యం చేయడం మరచిపోయినట్టయింది. దానికి తోడు ఆమెకి మాట్లాడడానికీ ఏమీ తోచలేదు.

ఆ తరవాత ఆమెని ఒక స్కూలు కుర్రాడు నాట్యానికి ఆహ్వానించాడు. నవ్వొచ్చిందామెకి. ఆఖరికి ఇలాటి స్కూలు పిల్లలతో డాన్సు చేయడానికా తానీ విందుకి వొచ్చింది.

ఓడిపోయి గాయపడిన మనసు చిత్రవధ చేస్తూంటే, సిగ్గూ, అవమానమూ ముంచెత్తిన ఆ సాయంత్రపు ఒంటరితనం ఆమె భరించలేకపోయింది. మేనత్త వైపు తిరిగి, "మనం ఇంటికి వెళ్ళిపోదాం," అంది. మేనత్త కూడా సరే నని తల వూపి బయటికి నడిచింది.

ఇంకా ఏముందని ఆ విందులో కూర్చోవడానికి! మనసంతా దిగులుతో డాలీ మొహం పక్కకు తిప్పుకుని కూర్చుంది బగ్గీలో. మేనత్త మొహం గంటు పెట్టుకొని మూతి బిగించుకొని కూర్చుంది ఇల్లు చేరేవరకు. దారంతా ఇద్దరూ ఒక్క మాట కూడా మాట్లాడుకోలేదు.

ఇంటి ముందు బగ్గీ ఆగిన చప్పుడవగానే బిడన్స్ పరిగెత్తుకొచ్చింది. "అపుడే వచ్చేసారే", అంటూ. బిడన్స్ ప్రశ్నలనించీ, ఆశ్చర్యాలనించీ తప్పించుకోని డాలీ తన గదిలోకి పరిగెత్తి తలుపు గొళ్ళెం వేసుకుని పక్కమీద వాలిపోయింది.

మనసులో సుడులు తిరుగుతున్న దుఃఖం ఏడుపులా మారకుండా గొంతు బిగ్గ పట్టుకుంది. లేచి జుట్టులో ముడుచుకున్న వాడిపోయిన పూల దండని పీకి పక్కన పారేసింది. నలిగి పోయిన గౌను విప్పి అవతల పడేసింది. ఆ దరిద్రపు పూలూ, గౌనూ తన కళ్ళకి కనపడకుండా వుంటే బాగుండనుకుంది.

అసలు ప్రపంచంలో తననెవరూ చూడలేనీ, ఎవరి మాటలూ వినిపించనంత దూరం వెళ్ళిపోతే! గది గోడలు పల్చగా వుండి ఆమెకి పక్క గదిలోని సంభాషణంతా నిర్దాక్షిణ్యంగా వినపడుతునే వుంది.

విందులో తన పట్ల అందరూ చూపించిన నిర్లక్ష్యమూ, తన అవమానమూ, నిరాశా, పూస గుచ్చినట్టు చెప్తోంది మేనత్త, పనమ్మాయితో. ఆఖర్న నిట్టూర్చింది.

"నేను మాత్రం ఏం చేయగలను చెప్పు? ఎందుకనో దానికి కాలం కలిసి రాలేదు."

అబ్బా! యెంత సిగ్గుచేటు! ఇదే తనకి మొదటి విందు, ఆ విందులో ఒక్క అబ్బాయి కూడా తనని డాన్సుకి రమ్మనలేదు. తన ముస్తాబునీ, బట్టలనీ మెచ్చుకోలేదు. తనని చూసి మెరిసిపోవడానికి ఒక్క జత కళ్ళు కూడా లేకపోయాయి. ఇంతకంటే అవమానం ఇంకొకటుంటుందా? డాలీ మనసంతా భగభగ మండింది.

ఇంత అంతర్మథనంలోనూ ఎక్కడో గుండె లోతుల్లోంచి ఒక చిన్న గొంతు వినబడుతూనే వుంది. ఆ గొంతు బేలగా, "ఇందులో నా తప్పేం వుంది?" అని అడుగుతోంది.

తను శక్తి వంచన లేకుండా కష్టపడింది. చక్కగా ముస్తాబయింది, చక్కటి శుభ్రమైన బట్టలు ధరించింది. జుట్టు అందంగా అలంకరించుకుంది. పూలు ముడుచుకుంది. నవ్వు మొహంతో స్నేహపూర్వకంగా అందరి వైపు చూసింది. ఇన్ని చేసినా తను ఎవ్వరికి నచ్చకపోవడానికి తనేం పాపం చేసింది? అన్నిటికంటే ఆమెకి తను మొహం మీద అతికించుకున్న ఆ సిగ్గులేని నవ్వు తలచుకుంటే తన మీద తనకే రోత పుట్టింది. పనికిరాని సామాగ్రిని కొనుగోలుదారుకు అంటగట్టేటప్పుడు దుకాణ దారు అదే సిగ్గులేని నవ్వు నవ్వుతాడు.

ఆ మగవాళ్ళెవరికీ తను నచ్చలేదు. నిజానికి తనకి కూడా అక్కడున్న మగవాళ్ళెవరూ  నచ్చలేదు. అయినా తనేమో మొహానికి చిరునవ్వు తగిలించుకొని కూర్చుంటే, వాళ్ళేమో నిర్మొహమాటంగా తనని నిరాకరించారు. ఎక్కణ్ణుంచి వచ్చింది వ్యత్యాసం? వాళ్ళంత నిర్భయంగా తను తన అయిష్టాన్నెందుకు ప్రకటించలేకపోయింది?

ఆ రాత్రి అనుభవించిన అవమానమూ, నొప్పీ, నిరాశా అన్నీ కలిసి ఆత్మ న్యూనతగా పరిణమించి, అణచుకున్న దుఃఖం కన్నీళ్ళైంది. దుప్పటి కింద దిండులో తల దూర్చి కళ్ళల్లో నీళ్ళింకిపోయే వరకూ ఏడ్చింది డాలీ ఆ రాత్రి.

★★(సమాప్తం)★★

హెన్రీ హేండెల్ రిచర్డ్‌సన్ అనే కలం పేరుతో రచనలు సాగించిన ఆస్ట్రేలియన్ రచయిత్రి ఈథెల్ ఫ్లొరెన్స్ లిండేసే రిచర్డ్‌సన్. 1870 లో పుట్టిన ఈవిడ ఆ రోజుల్లోనే స్వలింగ సంపర్కుల గురించి నవలలూ, కథలూ రాసారు. ఆవిడ నార్వీజియన్ భాషనుంచి కొన్ని అనువాదాలు కూడా చేసారు. మెల్బోర్న్‌లో జన్మించిన ఆవిడ జర్మనీలో మూడేళ్ళపాటు సంగీత విద్యనభ్యసించారు. తనకి సంగీతం పట్టుబడడంలేదని, రచనలు ప్రారంభించారు.

And woman must weep అనే ఈ కథలో ఆ రోజుల్లోని స్త్రీల దయనీయ పరిస్థితి చాలా సున్నితంగా వివరించారు.

ఆ నాటి యూరోపియన్ సమాజంలో ఆడపిల్లలు తమ అందచందాలతో, వాక్చాతుర్యంతో తమకి తగిన వరుణ్ణి ఆకట్టుకొని పెళ్ళిచేసుకోవాల్సిన పరిస్థితి వుండేది. మళ్ళీ ఆ పనంతా వాళ్ళు తమ స్త్రీ సహజమైన సిగ్గూ, మొహమాటమూ ఒలకబోస్తూ చేయాల్సొచ్చేది. పెద్ద చదువులూ, ఉద్యోగాలూ, స్వయం ప్రతిపత్తీ, ఏవి వాళ్ళకి అందుబాటులో వుండేవి కావు. పెళ్ళి తప్ప ఇంకే రకమైన భవిష్యత్తూ, వృత్తీ, వ్యాపకమూ ఏదీ లేని నిస్సహాయత. పెళ్ళి కావాల్సిన ఆడపిల్లలూ, మగ పిల్లలూ కలుసుకొని పరిచయాలు చేసుకోవడం కోసం పెద్ద కుటుంబాలూ, చర్చీ మొదలైన సంఘాలు డాన్సు పార్టీలు నిర్వహించేవారు. ఈ పార్టీలో నచ్చిన ఆడపిల్లని నాట్యానికి మగపిల్లలు అహ్వానిస్తారు. జంటలుగా చేసే ఈ డాన్సులలో ఆడపిల్లలూ మొగపిల్లలూ మాట్లాడుకుంటారు, నచ్చితే పెళ్ళిచేసుకుంటారు. అయితే వీటన్నిటిలోనూ మగపిల్లలదే నిర్ణయాధికారం. ఆడపిల్లలు వారి నిర్ణయం కోసం ఎదురుచూస్తూ ఎవరైనా తమని ఇష్టపడకపోతారా అని ఎదురుచూస్తూ వుండడం తప్ప చేయగలిగిందేదీ లేదు.

అప్పుడప్పుడూ, ఈ మధ్య కాలంలో "మగపిల్లలకి పెళ్ళిచూపులూ, ఆడపిల్లల తల్లి తండ్రుల ధాష్టీకమూ" లాటి వస్తువులతో హాస్య కథలు చదివినప్పుడు నాకు నవ్వురాదు. కొన్ని తరాల ఆడపిల్లల నిస్సహాయత గుర్తొచ్చి!

ఈ కథకి “ఆడబ్రతుకే మధురం” అనే పేరు పెట్టడం వెనక స్వర్గీయ కొడవటిగంటి కుటుంబరావుగారికి గౌరవపూర్వకమైన నివాళి ఇవ్వడం తప్ప మరే ఇతర ఉద్దేశ్యమూ లేదు.

– శారద

COMMENTS